మార్కెట్ మూన్నాళ్ల ముచ్చటే!

- పోలీస్‌స్టేషన్ ప్రహరీ పనులు షురూ
- కుంచించుకుపోతున్న మార్కెట్ స్థలం
- తోపుడు బండ్లన్నీ రోడ్డు పైనే
- రూ. 25 లక్షల ప్రజాధనం దుర్వినియోగంపై విమర్శల వెల్లువ



పామిడిలో నిరుపయోగంగా మారిన కూరగాయల మార్కెట్

పామిడి: పట్టణంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఆర్భాటంగా మార్కెట్‌ను ప్రారంభించినా వినియోగంలోకి రాలేదు. దీంతో మార్కెట్ ఏర్పాటు కోసం వెచ్చించిన ప్రజాధనం కాస్త వృథాగా మారింది. వివరాలు.. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన గత ఫిబ్రవరి నెల 17న కూరగాయల మార్కెట్‌ను ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. సాధారణ పంచాయితీ నిధుల కింద రూ.25 లక్షలతో ఈ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. చాలీచాలనీ స్థలంలో మొదట్లో కొన్ని కూరగాయల తోపుడు బండ్లు పెట్టినా ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగలేదు. దీంతో మార్కెట్‌లో తోపుడు బండ్లు పెట్టడానికి వ్యాపారులు ఎవరూ ఆసక్తి కనబరచడంలేదు.

చాలనీచాలని స్థలం

పట్టణంలోని సర్వేనెంబర్ 437లోని 1.27 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. దాన్ని ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 427లో 24 సెంట్ల ప్రభుత్వ భూమిలో పెద్దకాలువ వెళ్లేది. కాలక్రమేణ ఈ కాలువ అక్రమణలతో కుచించుకుపోయింది. పూర్వం వ్యవసాయ కాలువైన ఈ కాలువ ప్రస్తుతం మురుగు కాలువగా మారింది. ఈ కాలువపై స్లాబ్ వేసి కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశారు. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పోలీసు శాఖ ప్రహరీ ఏర్పాటు చేయడం, ఉన్న 4 సెంట్ల స్థలం పొడవుగా ఉండటంతో తోపుడు బండ్లు పెట్టుకోవడానికి ఇరుకుగా మారింది.

బండ్లన్నీ రోడ్డుపైనే...

కేవలం ఒక్క పామిడిలోనే 467 దాకా తోపుడు బండ్లు ఉన్నాయి. కూరగాయల మార్కెట్‌ను చాలీచాలనీ స్థలంలో ప్రారంభించారు. మొదట్లో పది తోపుడు బండ్లకు మించి ఏర్పాటుకు చేయలేని పరిస్థితి. వాటికి సరైన వ్యాపారాలు జరగకపోవడంతో కూరగాయాల మార్కెట్‌లోని ఆ బండ్లు సైతం తిరిగి రోడ్లపైకే వచ్చాయి. వరదలు వస్తే ఈ అండర్ డ్రైనేజీ మొత్తం పొంగిపొర్లి ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. దీంతో కూరగాయల మార్కెట్‌కు వెచ్చించిన రూ.25 లక్షల ప్రజాధనం వృథా అయిందని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రోడ్డుపైకి చేరిన తోపుడు బండ్లు

'సాక్షి' చెప్పిందే నిజమైందంటున్న జనం

కూరగాయల మార్కెట్ ఏర్పాటుపై సాక్షి దినపత్రిక మొదట్లో కథనం ప్రచురించింది. చాలీచాలని స్థలంలో మార్కెట్ నిర్వహణ కష్టమని, ఇందుకోసం వెచ్చించిన రూ.25 లక్షలు ప్రజాధనం వృథా అనే స్పష్టం చేసింది. ఈ కథనంపై తెలుగుదేశం పార్టీ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. ప్రస్తుతం మార్కెట్ నిరుపయోగంగా మారడంతో సాక్షి దినపత్రిక చెప్పిందే నిజమని పట్టణ ప్రజలు గుర్తు చేస్తున్నారు.

మార్కెట్ వినియోగంపై శ్రద్ధ చూపుతాం



కాలువ స్థలం మార్కెట్‌కు అనుకూలంగా ఉంటుందని ఏర్పాటు చేశాం. దీనికి తోడు ఈ స్థలం అందరికీ అందుబాటులో ఉంటుందని భావించాం. తోపుడు బండ్లు మార్కెట్‌లోకి వస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందనుకున్నాం. పంచాయతీ, పోలీస్‌శాఖ సమన్వయంతో తోపుడు బండ్ల నిర్వాహకులకు మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకోమనే చెబుతున్నాం. బండ్లు మార్కెట్‌లో పెట్టుకునేలా యతిస్తున్నాం. -ఎం.గోపాల్, పంచాయతీ ఈఓ.

ప్రభుత్వాస్పత్రి ఏఓను సస్పెండ్ చేయాలి



తాడేపల్లిలోని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళా ఉద్యోగినులు, కార్మికుల పట్ల లైంగిక వేధింపులతో పాటు అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏఓ రామ్‌ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఆస్పత్రి ఏఓపై రెండు విచారణ కమిటీలు దర్యాప్తు చేపట్టి నెలలు గడుస్తున్నా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం తాడేపల్లిలోని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ ఆస్పత్రి ఏఓ లైంగిక వేధింపులు, అక్రమాలకు పాల్పడినట్లు విచారణ కమిటీల ఎదుట బాధితులంతా వాపోయినా అతడిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. అతడి అక్రమాలు, లైంగిక చేష్టలు వెలుగుచూసిన అనంతరం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఏఓ వైద్యశాఖ ఉన్నతాధికారుల సహకారంతోనే ప్రతి నెలా వేతనాలు పొందుతున్నారని ఆరోపించారు. అనంతరం రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎ.సిరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏఓ వికృత చేష్టలపై క్రిమినల్ కేసు పెట్టాలని కోరారు. నాయకులు రఘునాథరెడ్డి, రామాంజినేయులు, సత్తార్, నారాయణ, రామదాస్, జానయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను అరికట్టండి



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: పట్టణంలో కుక్కల బెడదను అరికట్టాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, ఫరూక్, కేవీ రమణ, వెంకట సుబ్బయ్య, ఖాజా ఖాన్ మాట్లాడుతూ కుక్కల బెడదతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనాలు బయటకు రావాలంటనే భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే వాటిని అరికట్టాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు నజీర్, సుబ్బయ్య, బుసా రూపావతి, సులోచన, లక్ష్మి రాణి తదితరులు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, తాగునీటి , డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జబ్బార్‌మియా, మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, కిరణ్, ఆర్‌ఓ సతీష్ కమలాకర్, ఆర్‌ఐ షెక్షావలి, మెప్మా సీఎంఎం శ్రీనివాసరెడ్డి, కో–ఆర్డినేటర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యనందించండి

పెద్దవడుగూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సీడీపీఓ సాజిదాబేగం సిబ్బందికి సూచించారు. బుధవారం క్రిష్టిపాడు గ్రామంలో జరుగుతున్న పోషన్ భీ, పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే పౌష్టికాహారం ప్రాధానత్యను తెలియజేశారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ –భీ పడాయి– భీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నార్పల సీడీపీఓ భారతి 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు ఎలా విద్యనందించాలో తెలియజేశారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజామణి, లావణ్య, శాంతమ్మ, సునాలిని, లావణ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించం



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ రోహిత్‌చౌదరి

పెద్దవడుగూరు : గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని ఏఎస్పీ రోహిత్‌చౌదరి హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో 'మీ మాటే ముఖ్యం' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో భూమి సమస్యలు అధికంగా వస్తున్నాయని, వాటిని రెవెన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. అవసరమైతేనే తమను ఆశ్రయించాలని సూచించారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాల్లోని రౌడీషీటర్ల వివరాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. పాత నేరస్తులు, ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

పెద్దవడుగూరు: భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఉషారాణి సిబ్బందికి సూచించారు. బుధవారం చిత్రచేడు, చిట్టూరు గ్రామాల్లో రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే అధికారులు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి భూముల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల సర్వేయర్ ప్రసాద్, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు,

బాలుడి కాలులో దిగబడిన చేపల గాలం



బాలుడి కాలికి గుచ్చుకున్న చేపల గాలం (ఇన్‌సెట్‌లో) గాలం

గార్లదిన్నె: ముకుందాపురంలో ఓ బాలుడు కాలికి ప్రమాదవశాత్తు చేపల గాలం దిగబడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కౌశిక్ అనే బాలుడు చెరువు దగ్గరకు వెళ్లి చేపలు పట్టుకునేందుకు గాలం విసరగా ప్రమాదవశాత్తు అది అతడి కాలిలోకి దిగబడింది. స్థానికులు వెంటనే బాలుడిని 108లో గార్లదిన్నె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు బాలుడిని అనంతపురం రెఫర్ చేశారు. అయితే 108 ఈఎంటీ లక్ష్మినారాయణ, పైలెట్ బాబా ఇస్మాయిల్ చొరవ తీసుకుని బాలుడి కాలిలో ఉన్న చేపల గాలం తొలగించారు.

మాజీ ఎంపీపీ ఇంటిపై దాడి ఘటనలో 84 మందిపై కేసు

గుత్తి: పట్టణానికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నేత కోనా మురళీధర్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనలో పోలీసులు 84 మందిపై కేసు నమోదు చేశారు. మద్యం సిండికేట్ విషయంలో మాజీ ఎంపీపీ ఇంటిపై టీడీపీ శ్రేణులు సోమవారం రాత్రి దాడి చేసిన విషయం తెలిసిందే. ఘటనపై కోనా సతీమణి కోనా శ్రీలత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి తాను ఒంటరిగా ఉన్న సమయంలో టీడీపీ నాయకులు ప్రతాప్, ఓం ప్రకాష్(చిన్న), రమేష్, గోవర్దన్‌తో పాటు మరో 80 మంది దాకా ఇంటిపై దాడి చేయడంతో తనకు స్వల్పగాయాలయ్యాయని, కారు ధ్వంసమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ వెంకటేశ్వర్లు బుధవారం పై నలుగురితో పాటు మరో 80 మందిపై కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టండి



ప్రజావేదికలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

పెద్దవడుగూరు: మండలంలోని ఉపాధిహామీ పనులు నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ సలీమ్‌బాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన వివరాలను చదివి వినిపించారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి గతేడాది మార్చి 31 వరకూ ఉపాధిహామీ కింద రూ.11.78 కోట్లు ఖర్చు చేయగా ఇందులో రూ.29 వేలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. బాధ్యుల నుంచి రూ.12 వేలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి రూ.5,46,526 విలువ జేసే మొక్కలు చనిపోయినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ వెంకటశివారెడ్డి, ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, ఏపీఓ పుల్లారెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో కారు టైరు పేలి అదుపు తప్పి దూసుకెళ్లి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన శ్రీనివాసులు, లవన్న వ్యక్తిగత పనినిమిత్తం గుంతకల్లుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని మంగళవారం రాత్రి కారులో తిరిగి కర్నూలుకు బయలుదేరారు. అయితే రజాపురం గ్రామ శివారులో కారు ముందు టైరు పేలి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారు వేగం అధికంగా ఉండటంతో మట్టి కుప్పలు ఎక్కి ముందుకు వెళ్లి ఆగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు కుదుపులకు గురై తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన వాహనదారులు 108లో వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో ఓ వ్యక్తి భార్యపై దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బీసీకాలనీకి చెందిన వెంకటేష్ తప్ప తాగివచ్చాడు. దీంతో భార్య పరిమళ మందలించింది. కోపంతో వెంకటేష్ ఆమెపై కట్టెతో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు ఆమెను అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉగాదికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

తాడిపత్రి రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకొని తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, బెంగళూరుకు స్పెషల్ సర్వీసులను నడపనున్నట్లు డీఎం శంకర్ బుధవారం తెలిపారు. ఈనెల 28, 29 తేదిల్లో హైదరాబాద్ నుంచి తాడిపత్రికి ఈనెల 31, ఏప్రిల్ 1న తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు అదనంగా 3 సర్వీసులు నడుపుతామన్నారు. అలాగే 28, 29 తేదీల్లో బెంగళూరు నుంచి తాడిపత్రికి, ఈనెల 31, ఏప్రిల్ 1న తాడిపత్రి నుంచి బెంగళూరుకు అదనంగా 3 సర్వీసులు నడుపుతామన్నారు.

నేడు వైస్ ఎంపీపీ–2 ఎన్నిక

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీ–2 ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి బుధవారంతెలిపారు. వైస్ ఎంపీపీ–2 రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ స్థానం ఖాళీగా ఉందన్నారు. వైస్ ఎంపీపీ–2 ఎన్నికకు ఎంపీటీసీలు అందరూ హాజరుకావాలని కోరారు.

అరటి రైతులను అదుకుంటాం

యల్లనూరు: ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోయిన అరటి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. బుధవారం కూచివారిపల్లి, బుక్కాపురం, తిమ్మంపల్లి, దంతలపల్లి, గొడ్డుమర్రి తదితర గ్రామాల్లో నష్టపోయిన అరటి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారన్నారు. అలాగే ఎమ్మెల్యే కూచివారిపల్లిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ

పామిడి: స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ గేట్లకు తాళాలు తొలగించి లోపల ఉన్న ఒక గ్యాస్ సిలిండర్, ఐదు ప్యాకెట్ల బియ్యంను ఎత్తుకెళ్లారు. గర్భగుడి, వంట గది, గుడి తలుపుల తాళాలను పగులగొట్టి అయ్యప్పస్వామి విగ్రహ చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వేములపాడులో ఇఫ్తార్ విందు

తాడిపత్రిటౌన్(యాడికి): యాడికి మండలం వేములపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత చిట్టెం వెంకటరంగారెడ్డి కుమారుడు చిట్టెం రంగారెడ్డి గ్రామంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ముస్లింలతో ప్రత్యేక పార్థనల్లో చేశారు. అనంతరం ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు.

రక్తదాన శిబిరం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సినీహీరో రామ్‌చరణ్ జన్మదినాన్ని ఆయన అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అభిమాన సంఘం జిల్లా నేత బోయగడ్డ బ్రహ్మయ్య, చిరు యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

రేపు హింగులాజ్ మాత జయంతి

పామిడి: స్థానిక చిన్న విఠోబ కాలయంలో రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో శుక్రవారం హింగులాజ్ మాత జయంతిని నిర్వహించనున్నట్లు ఆ ఫిర్కా సమాజ్ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం మహిళలతో అమ్మవారికి కుంకుమార్చన, అమ్మవారి ఒడి నింపుట, చిన్నారులకు విద్యార్థి సామగ్రి పంపిణీ ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని వివరించారు.

క్లుప్తంగా

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



ఎద్దులపల్లిలో మాట్లాడుతున్న ఏఓ డీ లీనా వసుంధర

పామిడి: అన్నదాతలు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని ఏఓ డీ లీనా వసుంధర సూచించారు. బుధవారం ఎద్దులపల్లి, జీ కొట్టాల, కాలాపురం గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. ఏఈఓ కే శ్రీనివాసరావ్, ఎంపీఈఓలు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, వీహెచ్ఏ చిరంజీవి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపు ఎస్ఆర్ఐటీలో ఇఫ్తార్ విందు

శింగనమల: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వ విద్యా మాజీ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని ముస్లింలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆడపిల్లల చదువు అవనికి వెలుగు



మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

పామిడి: ఆడపిల్లల చదువు అవనికి వెలుగు అని ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ అన్నారు. బుధవారం ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో బేటీ పడావో...బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి సుధాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్ష విడనాడాలన్నారు. నేటి సమాజంలో బాలికలు, బాలురకు ఏమాత్రం తీసిపోవడం లేదన్నారు. లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థినులుమానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎం రేణుక, ఆశా వర్కర్ సులోచన, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల

గుంతకల్లు: స్థానిక శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల(అటానమస్)లో కళాశాల డైరెక్టర్ గోపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ ఆర్.సురేష్‌బాబు బుధవారం సెకండియర్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఏ, బీకామ్ జనరల్ విద్యార్థులు రూ.815, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకామ్ కంప్యూటర్స్ బయో టెక్నాలజీ, బీబీఏ, బీసీఏ విద్యార్థులు రూ.1050 ఫీజు చెల్లించాలన్నారు. అపరాధ రుసం లేకుండా ఏప్రిల్ 12 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఏప్రిల్ 9న పరీక్షల టైం టేబుల్ విడుదల చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు/ గుంతకల్లు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం స్థానిక శ్రీ పరిటాల కల్యాణమండపంలో ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే 45 మందికి రూ.41.10 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. గుంతకల్లు మండలంలోని పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, హంద్రీ–నీవాకు పిల్లకాలువలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి రాముడుయల్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామీణ పౌర సేవాసమితి ఆధ్వర్యంలో కసాపురంలో రూ.2.25 కోట్లతో ప్రతిపాదించిన అండర్ డ్రైనేజీ నిర్మాణపు పనులను వెంటనే ప్రారంభించాలని వినతిపత్రం సమర్పించారు.

ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు

గుంతకల్లు: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని పట్టణ యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఫోరం ప్రధాన కార్యదర్శి కేఎస్‌జే పాల్, ఆర్గనేజేషన్ సెక్రటరీ జీ.సురేష్, కోశాధికారి ఆంథోని బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొవ్వూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంపై పలు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పామిడి: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికే తీరని లోటని స్థానిక సీఎస్ఐ చర్చ్ సభ్యులు పీసీ రత్నరాజు, వీరయ్య, బుజ్జిబాబు, అనిల్‌కుమార్‌రాజా బుధవారం పేర్కొన్నారు. సౌమ్యుడు, స్నేహశీలి, పరోపకారి అయిన ఆయన మృతి జీర్ణించుకోలేనిదన్నారు. ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టి ఆయన కుటుంబానికి న్యాయం చేకూర్చాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ బుధవారం తెలిపారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

హమాలీలకు గుర్తింపు కార్డులివ్వాలి

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేస్తున్న హమాలీలకు గుర్తింపు కార్డులివ్వడంతో పాటు ప్రమాదబీమా వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో హమాలీలు రవికుమార్, శంకర్, భీమన్న, చంద్రశేఖర్, రాము, గణేష్, నాగరాజు, రిక్షా కార్మికులు శ్రీనివాసులు, చాంద్‌బాషా ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలోకి చేరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఎస్‌కెఎం.బాషా, మల్లికార్జున, రాజేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వినికిడి సమస్య దాదాపు 60 మందికి డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నారాయణ నాయక్, గౌరవాధ్యక్షుడు జీఎం చలపతి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ధనలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ బెంగళూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాలు.. పట్టణంలోని భగత్ సింగ్‌నగర్‌కు చెందిన ధనలక్ష్మి (32), రాజకుళ్లాయప్ప దంపతులు రావివెంకటాంపల్లి వద్ద హాస్టల్లో ఉంటున్న కుమారుడి వద్దకు బైక్‌పై వెళ్లారు. తిరిగి తాడిపత్రికి వస్తున్న సమయంలో వారి బైక్‌ను గుర్తుతెలియని ఆటో ఢీ కొని వెళ్లిపోయింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ధనలక్ష్మిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి అనంతపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరుకు తీసుకెళ్లారు. చికిత్స ఫలించకపోవడంతో ఆమె అక్కడే మృతి చెందింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలు తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగినిగా పని చేస్తోంది.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఇలాహి షాదీ ఖానాలో బుధవారం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ జబ్బార్ మియా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రంజాన్‌ను పురస్కరించుకుని సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మొత్తం 240 కుటుంబాలకు రూ.2 లక్షల విలువైన సరుకులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూ పంపిణీ చేపట్టాలి

పెద్దవడుగూరు : మండలంలో అర్హులందరికీ భూ పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు దబ్బల శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరన్న కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు.